AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

1-10-2026 (Thursday) MAIN EDITION

భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో గురువారం భారత్ మూడు పతకాలు గెలుచుకుంది. సెయిలింగ్ స్కిఫ్ విభాగంలో మను ఫ్రాన్సిస్, ప్రిన్స్ కురిసింకల్ రజతం గెలుచుకున్నారు. ఆర్చరీలో గణేష్ మణిరత్నం తిరుమూరు, కాంగ్ డక్ డాంగ్‌పై 149-144 తేడాతో ఘన విజయం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్క్వాష్‌లో మహిళల టీమ్ కాంస్య పతకం సాధించింది. సెమీఫైనల్‌లో హాంకాంగ్ చేతిలో 2-1 తేడాతో భారత జట్టు ఓడిపోయింది.

ఎమ్మెల్సీ టికెట్లపై మల్లు రవి కీలక వ్యాఖ్యలు



అక్షరటుడే, హైదరాబాద్ : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు సర్వోత్తంరెడ్డి, రామ్మోహన్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు టికెట్లు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఎంపీ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ పదవుల్లో సామాజిక న్యాయం పాటించామన్నారు. రెండుసార్లు రెడ్డి వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వలేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు.

పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర



అక్షరటుడే, ఢిల్లీ : కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర మరోసారి భారీగా పెరిగింది. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.62.50 పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలతో ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2810కి చేరింది. పెరిగిన ధరలు నేటి నుంచి అమలులోకి వచ్చాయి.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



అక్షరటుడే, హైదరాబాద్ : సనత్‌నగర్ టిమ్స్‌లో నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు.

లాభాలపంట పండించిన 'మనీవ్యూ'..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ అయిన మనీవ్యూ కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి బలంగా అడుగుపెట్టింది. లిస్టింగ్ సమయంలోనే 61.76 శాతం లాభాలను అందించింది. కంపెనీ ఒక్కో షేరును రూ. 34కు విక్రయించగా.. రూ. 55 వద్ద ఎన్ ఎస్ఈలో లిస్టయ్యింది.

మచ్చార్ సాహసంపై ప్రధాని మోదీ ప్రశంసలు



అక్షరటుడే, ఢిల్లీ : ఫైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అత్యంత సాహసోపేతంగా వ్యవహరించి వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను సురక్షితంగా కాపాడారు. ఆయన ధైర్యసాహసాలను అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. కెప్టెన్ స్మిత్ ప్రదర్శించిన సాహసాన్ని కొనియాడిన ప్రధాని మోదీ, ఆయనను నిజమైన హీరోగా అభివర్ణించారు. ప్రాణాపాయ స్థితిలో కూడా వెనుకాడకుండా ఇతరుల ప్రాణాలను కాపాడాలనే ఆయన నిశ్చయం అద్భుతమని, స్మిత్ సాహసమే పెద్ద ప్రమాదాన్ని తప్పించిందని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భారత్ ఎంతో గర్విస్తోందని ప్రధాని తెలిపారు.

ఎర్రవల్లి భూ సర్వే పూర్తి



అక్షరటుడే, సిద్దిపేట : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ భూ సర్వే నివేదిక పూర్తియింది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖల నుంచి అందిన ఈ సమగ్ర రిపోర్టును కలెక్టర్ హైమావతి ఇవాళ అధికారికంగా ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ నివేదికలో ఏయే అంశాలు వెల్లడవుతాయనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇదివరకు అసెంబ్లీ వేదికగా సిద్దిపేట జిల్లా మార్కుక్ మండల పరిధిలోని భూముల లెక్కలను తేల్చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ప్రభుత్వ భూముల్లో ఈ సర్వే చేపట్టారు.



ఖైరతాబాద్ బరిలో నిలిచేదెవరో..

■ తెరపైకి పీజేఆర్ కూతురు ■ హైకోర్టును ఆశ్రయించిన విజయారెడ్డి ■ తానే పోటీ చేస్తానంటున్న దానం

ఖైరతాబాద్ ఉప ఎన్నికపై రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. దానం నాగేందర్‌పై కోర్టు అనర్హత వేటు వేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అక్కడి నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశించే వారి సంఖ్య పెరుగుతోంది. మళ్లీ తనకే టికెట్ వస్తుందని దానం ధీమాగా ఉండగా.. తనకు అవకాశం ఇవ్వాలని పీజేఆర్ కూతురు కోరుతున్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అంతేగాకుండా ఎంపీగా సైతం పోటీ చేసి ఓడిపోయారు. దీంతో హైకోర్టు ఆయనపై అనర్హత వేటు వేసింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్ కార్యాలయం సైతం ధృవీకరించింది. దీంతో 6 నెలల్లోపు అక్కడ ఉప ఎన్నిక రానుంది. కాంగ్రెస్ నుంచి మరోసారి తనకు టికెట్ ఇస్తారని దానం నాగేందర్ భావిస్తున్నారు. ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుస్తానని ఆయన ఇప్పటికే పేర్కొన్నారు. అయితే తరుణ సైతం టికెట్ ఆశిస్తుండటంతో రాజకీయాలు వేడెక్కాయి.

విజయారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

పి జనార్ధన్‌రెడ్డి కుమార్తె విజయారెడ్డి సైతం ఖైరతాబాద్ నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు. ఈ మేరకు ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ ఎంపీ అభ్యర్థి అని, తాను ఎమ్మెల్యే అభ్యర్థి అన్నారు. పీజేఆర్ బిడ్డకు ఈసారైనా న్యాయం జరుగుతుందని ప్రజలు అనుకుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. పీజేఆర్ పేరు లేనిది కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ముందుకు వెళ్లలేదని చెప్పారు. దానం నాగేందర్‌ను జాతీయ రాజకీయాలకు పంపి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని ఆమె వ్యాఖ్యలు చేశారు. ఇతరులు సైతం టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అధిష్టానం టికెట్ ఎవరికి ఇస్తుందోన్న ఉత్కంఠ నెలకొంది.

హైకోర్టులో పిటిషన్

ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇక్కడ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని కోరుతూ పీజేఆర్ కుమార్తె, కాంగ్రెస్ నేత విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2024లో తాను దాఖలు చేసిన పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించే ప్రక్రియను నిలిపివేయాలని పేర్కొన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో దానం తన భార్య, ఆధారపడిన వారి ఆస్తులకు సంబంధించిన కీలక సమాచారాన్ని దాచిపెట్టారని ఆరోపిస్తూ విజయారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించి, ఆయన ఎన్నికను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఓ వైపు ఎన్నికల్లో పోటీ చేస్తానని చెబుతున్న ఆమె.. హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం. దీనిపై హైకోర్టు ఎలాంటి తీర్పు వెలువరిస్తుందో చూడాలి.




కేరళ యూనివర్సిటీలో ఉద్రిక్తత

అక్షరటుడే, కేరళ : తిరువనంతపురంలో ఓ యూనివర్సిటీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. హాస్టల్ బయట యూత్ కాంగ్రెస్ ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఎస్ఎఫ్ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు రాళ్లు, బీర్ సీసాలు, మండుతున్న కాగడాలతో దాడులు చేసుకున్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి నిరసన ప్రదర్శన చేపట్టారు. అయితే హాస్టల్‌లో నుంచి వారి ర్యాలీపై రాళ్లు, బీర్ సీసాలు, పెట్రోల్ బాంబులు విసిరారని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. మరోవైపు నిరసనకారులు మండుతున్న కాగడాలను హాస్టల్ ఆవరణలోకి విసిరారని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది.

టీసీఎస్‌తో ఫారం6 ను ఎందుకు మార్చారు : రాహుల్ గాంధీ

అక్షరటుడే, ఢిల్లీ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సందర్భంగా 'ఫారం 6'లో చేసిన మార్పులపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా మార్చారంటూ ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నలతో నిలదీశారు. ఆన్‌లైన్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా ఎందుకు మార్చారని రాహుల్ గాంధీ నిలదీశారు. ఈసీ సొంత కమిషనర్లే ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థకు ఆ మార్పు చేయమని ఎవరు ఆదేశాలు






నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభం

అక్షరటుడే, ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం గనుల మంత్రిత్వ శాఖ ద్వారా 'ఈవేస్ట్' (ఎలక్ట్రానిక్ వ్యర్థాల) నిర్వహణకు సంబంధించిన ఒక కార్యక్రమాన్ని చేపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రూ. 46,000 కోట్ల ప్రోత్సాహకంతో భారత ప్రభుత్వం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించిందని చెప్పారు. చాణక్యపురి ప్రాంతంలోని యశ్వంత్ ప్లేస్‌లో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమంలో జి. కిషన్ రెడ్డి రోడ్లను శుభ్రం చేశారు. గాంధీ జయంతి నుండి అక్టోబర్ 31న వచ్చే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వరకు 30 రోజుల పాటు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ 'స్వచ్ఛ భారత్' ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఈసీతో పాటు హైదరాబాద్‌ని తగలబెడతాం : దానం నాగేందర్

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హిమాయత్ నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన, ఎన్నికల కమిషన్ తన వైఖరి మార్చుకోకపోతే ఈసీ కార్యాలయంతో పాటు హైదరాబాద్ నగరాన్ని తగలబెడతామని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ అధికారులు బీజేపీతో కుమ్మక్కై వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దానం ఆరోపించారు.



రూ.50 కోట్ల ప్రభుత్వ భూమి గోల్‌మాల్



అక్షరటుడే, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో భారీ భూ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మంగళ్‌పల్లి గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర బట్టబయలైంది. మంగళ్‌పల్లి శివారులోని 4.25 ఎకరాల ప్రభుత్వ భూమిని వహీదా బేగం అనే వ్యక్తి పేరుతో అక్రమంగా పట్టా చేశారు. అంతేకాకుండా దీనికి సంబంధించి అధికారికంగా పట్టా పాస్‌పుస్తకం కూడా జారీ చేయడం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారం నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. తహశీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించినట్లు అధికారులు గుర్తించారు.

సెమీస్‌లో భారత్ ఘన విజయం..



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. శ్రీలంకతో జరిగిన సెమీ ఫైనల్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. భారత బౌలర్ల ధాటికి శ్రీలంక బ్యాట్స్‌మన్ విలవిలలాడారు. పరుగుల ఖాతా ఓపెన్ చేయకుండానే లంక జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం 45 పరుగులకే ఆలౌట్ అయింది. భారత్ 124 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది.